క్లుప్తంగా

రహదారికి శంకుస్థాపన

సామర్లకోట: స్థానిక జగ్గమ్మగారిపేటలో అమ్మా ఐమ్మ అపార్టుమెంటు, టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉండే వారి కోసం ఏడీబీ రోడ్డుకు కలుపుతూ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. సుమారు రూ.50 లక్షలు పంచాయతీరాజ్ నిధులతో నిర్మించనున్న ఈ రోడ్డుకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కొత్తూరులోని శివాలయం నుంచి పెదపులి చెరువు మీదుగా ఏడీబీ రోడ్డును కలుపుతూ రోడ్డు నిర్మిస్తామన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఏడీబీ రోడ్డు నుంచి జగ్గమ్మగారి కాలనీకి దగ్గర మార్గం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, కౌన్సిలర్ బలుసు వాసు, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ కంటే బాబు, పంచాయతీరాజ్ అధికారులు, హుస్సేన్‌పురం గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రార్థనలు


ఉపవాస ప్రార్థనల విశిష్టతను వివరిస్తున్న పాస్టర్ ఎలిషా

పెద్దాపురం: క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రపంచ శాంతికి రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. చదలాడ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం నిర్వాహకులు నంగిన శామ్యూల్ సుదీప్ అధ్యక్షతన నిర్వహించే ప్రపంచ శాంతికి ఏర్పాటు చేసిన ఉపవాస ప్రార్థనల్లో ప్రముఖ దైవ జనులు టి.ప్రకాష్ పాల్, నున్నాటి ఎలిషా ప్రసంగించారు. క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం వ్యవస్థాపకులు నంగిన సత్యానందం, దైవజనులు వంకా జాన్, కె.అభిషేక్, రాజ్‌కుమార్, జయకుమార్, ఆయా సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

దేవదాయ భూమి మెరక పనుల పరిశీలన


పెనుగుదురులో మెరకచేస్తున్న దేవస్థానం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

కరప: మండలం పెనుగుదురులో దేవదాయశాఖకు చెందిన 3.28 ఎకరాల పంటభూమి ఉంది. ఈ భూమిని చొల్లంగి వెంకటేశ్వర ఆలయ అర్చకునికి కేటాయించారు. సదరు భూమిని అర్చకుని నుంచి ఒక రైతు లీజుకు తీసుకున్నారు. కాగా దానికి చుట్టూ ఉన్న భూమిని రియల్టర్లు కొనుగోలు చేసి లే అవుట్లు వేశారు. దీంతో సదరు దేవస్థానం భూమికి నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ భూమిని మెరక చేస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు డిస్ట్రిక్ట్ ఎండోమెంట్స్ ఆఫీసర్ (డీఈఓ) కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్, కాకినాడ నూకాలమ్మ గుడి ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, అర్చకునితో కలసి మెరకచేస్తున్న అర్చక మాన్యాన్ని పరిశీలించారు. దేవదాయశాఖ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా మెరక చేయవద్దని అధికారులు సదరు రైతుకు తెలిపారు. దేవస్థానం భూమిలో ఎటువంటి పనులు జరగకుండా పర్యవేక్షించాలని అర్చకుడిని డీఈఓ నాగేశ్వరరావు ఆదేశించారు.

వరలక్ష్మీ నమోస్తుతే..


పాదగయ క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు


పాదగయ క్షేత్రంలో ప్రత్యేక అలంకరణలో పురుహూతికా అమ్మవారు


పిఠాపురంలో లక్ష్మీదేవి అమ్మవారికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


సామర్లకోట నవదుర్గ ఆలయంలో అష్టలక్ష్మీ పూజలు

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవి వ్రతాలు
- కిటకిటలాడిన పాదగయ
- అమ్మవార్లకు విశేష పూజలు

పిఠాపురం: శ్రావణ మాసంలో మూడో శుక్రవారం వరలక్ష్మీదేవి వ్రతాలు భక్తిశద్ధలతో జరిగాయి. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పిఠాపురం పాదగయ క్షేత్రం శ్రావణ శోభను సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో పాదగయ కిటకిటలాడింది. పాదగయ పుష్కరిణిలో మహిళలు, భక్తులు పవిత్ర స్నానాలను ఆచరించారు. మహిళలు వరలక్ష్మీదేవి వ్రతాలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలోని పురుహూతిక, రాజరాజేశ్వరి అమ్మవార్ల సన్నిధిలో మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతిక అమ్మవార్లు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలయాలకు భక్తుల తాకిడి

పిఠాపురం నియోజకవర్గంలో అన్ని గ్రామాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. మహిళలు ఎక్కువగా తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీ దేవి ప్రతిరూపాలైన కలషాలను ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణాదేవి అమ్మవారి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వందలాది మంది భక్తులు అమ్మవారి చెంత వరలక్ష్మీ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


భువనేశ్వరి పీఠంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

పెద్దాపురం: శ్రావణ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతాలను పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం కనకదుర్గ, వనదుర్గ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయం, కాండ్రకోట నూకాలమ్మ ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దివిలి భాస్కర రామా రైస్ మిల్లు వద్ద అమ్మవారిని నెలకొల్పి పూజలు నిర్వహించారు. స్థానిక వర్జుల వారి వీధిలో భువనేశ్వరీ పీఠంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో వందల సంఖ్యలో భక్తులు హాజరై సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ పూజలు

సామర్లకోట: నియోజకవర్గంలో అత్యంత ప్రసిద్ధి చెందిన బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గా సమేత దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అష్టలక్ష్మీ సహిత వరలక్ష్మీ వతాన్ని వైభవంగా నిర్వహించారు. ఏటా ఏడాది పౌర్ణమి ముందు రోజు శుక్రవారంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కనక విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, అష్టలక్ష్మీ పూజ, హోమం కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రత పూజ అనంతరం అమ్మవారి ఆలయాలకు తరలివచ్చారు. సామూహిక వ్రతాల్లో పాల్గొన్న మహిళలకు కమిటీ ఆధ్వర్యంలో భోజనాల ఏర్పాటు, అనంతరం 316 మందికి ముత్తైదువులకు డ్రా ద్వారా చీరలను అందజేశారు. ఆలయంలో దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సత్తిరాజు, సరోజ్ వాసు, ఎస్ఆర్‌వై ప్రసాద్ సేవలందించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బ్రౌన్‌పేట సెంటర్‌లో కనక దుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త నూతలపాటి సింహాచలం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు.


కొత్తపల్లి మండలంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి: శ్రావణమాసంలో మూడో శుక్రవారం కావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లను వివిధ రకాల పూలతో సుందరాతి సుందరంగా అలంకరించారు. కొత్తపల్లి శ్రీధర్మశాస్తా ఆలయంలోని దుర్గాదేవి, కొత్తదొడ్డిలో బాలదుర్గ, యండపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, కొండెవరం, గొర్స, ఉప్పాడతో పాటు పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, కొత్తపల్లిలోని బాలిత్రిపుర సుందరీ సమేత రాజేశ్వరిస్వామి ఆలయం, ఉప్పాడ, గోర్స, మూలపేట, యండపల్లిలోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు


మరిడమ్మ వద్ద బంగారు, వెండి పుష్పాలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు.

స్వచ్ఛతపై ప్రయాణికుల భాగస్వామ్యం


స్వచ్ఛతపై ప్రయాణికుల అభిప్రాయాలు సేకరిస్తున్న స్టేషన్ మేనేజరు

సామర్లకోట: పరిసరాల పరిశుభ్రతపై ప్రయాణికుల భాగస్వామ్యం ఉండాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ అన్నారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామర్లకోట రైల్వేస్టేషన్ ప్రయాణికుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. రైల్వే స్టేషన్ ఒకటవ నంబరు ప్లాట్ పారం స్టేషన్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద బోర్డు ఏర్పాటు చేసి ప్రయాణికుల సూచనలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు కల్యాణి, ట్రాఫిక్ ఎన్‌స్పెక్టరు కెవీ గిరి, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పిఠాపురం మండలంలో పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్ విభాగం అధ్యక్షుడిగా పైలా సన్యాసినాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలిగా రాసంశెట్టి భవాని, రైతు విభాగం బండి వెంకట సుబ్బారావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షులుగా రాయుడు చిన్ని, మహింద్రవాడ సింహాచలం, వల్లపు నాగేంద్ర, క్రిస్టియన్ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా వేమగిరి సోమరాజు, స్టూడెంట్ వింగ్ పల్లిక అజయరాజా, పంచాయతీ రాజ్ వింగ్ ముద్దా నానిబాబు, ఆర్టీఐ వింగ్ కర్రి కృష్ణంరాజు, వలంటీర్ వింగ్ కందా దుర్గారావు, వీవర్స్ వింగ్ మావూరి శంకరరావు, వాణిజ్య విభాగం ఓలేటి పాపిరెడ్డి, కల్చరల్ వింగ్ మేళం శ్రీనివాసరావు, సోషల్ మీడియా వింగ్ పరసా మణికంఠ, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడిగా కె.మహేశ్వరరావు నియమితులయ్యారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ధర్నా


ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

ఏలేశ్వరం: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించిన కూటమి నాయకులు అధికారంలోకి రాగానే వాటికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం దారుణమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చెక్కల రాజ్‌కుమార్ విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు భారంగా మారనున్న స్మార్ట్‌మీటర్లను గతంలో వ్యతిరేకించిన కూటమి నాయకులు నేడు వాటిని అమలు చేయడం అన్యాయమన్నారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం చార్జీలను విపరీతంగా పెంచిందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాకలపాటి సోమరాజు, రొంగల ఈశ్వరరావు, పిల్లా రాంబాబు, రౌతు సత్యనారాయణ, దొంగబాబు, సత్యవతి, వెంకటలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి


స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు, కౌలురైతులు, సంఘ ప్రతినిధులు

కరప: మండలం కొరిపల్లి గ్రామంలో శుక్రవారం ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో భారత రత్న, ఫాదర్ ఆఫ్ గ్రీన్ రెవల్యూషన్ పురస్కార గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారతరత్న స్వామినాథన్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, రైతులు, కౌలు రైతులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడుతూ ఎకరానికి 5, 10 బస్తాలు పండే సమయంలో స్వామినాథన్ మూడు పదుల వయసులో దేశ జనాభా నిరంతరం పెరుగుతోంది కానీ, భూమి పెరగదు అని గ్రహించి జపాన్, అమెరికా, మెక్సికో శాస్త్రవేత్తలతో కల్సి వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి, అధిక దిగుబడులు సాధించి ప్రజల ఆకలికేకలు దూరం చేశారన్నారు. దేశంలో ప్రజలకు సరిపడా పండించడమే కాకుండా, విదేశాలకు ఎగుమతి చేసే విధంగా ఆహార పంటలను అభివృద్ధి చేశారని వారు శ్లాఘించారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెస్ స్వామినాథన్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటుచేసింది. క్వింటా ధాన్యానికి రూ.2 వేలు ఖర్చవుతోంది కాబటి, దానికి 50 శాతం అదనంగా కలిపి ఆహారపంటలకు ఇవ్వాలని సదరు కమిషన్ సిఫార్స్ చేసింది. ఆ తర్వాత ఆయన కుమార్తె జయతి ఘోష్ కమిషన్ కూడా నియమించారు. ఆ కమిషన్ సైతం అదే చెప్పింది. అయినా నేటికి కూడా స్వామినాథన్ కమిషన్ సిఫార్స్ అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నారని, దేశమంతా అమలుచేసి ఉంటే నేడు రైతుల ఆత్మహత్యలు ఉండేవి కావన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం ప్రతినిధులు, రైతులు నురుకుర్తి నాగేశ్వరరావు, పెంకే సత్యనారాయణ, రెడ్డి భద్రం, పెంకే నారాయణరెడ్డి, అప్పాడ బూరయ్య, దెయ్యాల తాతాజీ, కాదా సత్యనారాయణ, రెడ్డి పెద్దకాపు, పెంకే వెంకటరమణ, పెంకే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

గండేపల్లి: విద్యార్థులు రక్షా బంధన్ పర్వదినం నుంచి తమ సోదరుల పేరిట మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎస్. సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వృక్షాబంధన్‌కు ప్రాధాన్యం ఇచ్చి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్స్ ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో గిరాఖీ

- రాఖీపౌర్ణమి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- దత్తాత్రేయస్వామికి రాఖీలు కట్టేందుకు తరలి వస్తున్న మహిళలు
- దత్తాత్రేయ ఆలయాలకు క్యూ కట్టిన మహారాష్ట్ర భక్తులు


విశేష అలంకరణలో స్వామివారు

పిఠాపురం: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో ఆలయలకు భక్తులు పోటెత్తారు. పిఠాపురంలో ప్రముఖ దత్త క్షేత్రాలైన శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం, పాదగయ క్షేత్రం, అనఘాదత్త క్షేత్రం, గోపాల్‌బాబా ఆశ్రమాలకు తమిళనాడు, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దత్తాత్రేయునికి రాఖీలు కట్టేందుకు తరలి వస్తుంటారు. ఏటా రాఖీ పౌర్ణమి రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు వస్తారు. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో ఇప్పటికే పిఠాపురంలో ఆలయాలకు మరాఠీ భక్తులు చేరుకున్నారు. దీంతో రాఖీలకు గిరాకీ పెరిగింది. శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలం కావడంతో పిఠాపురంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. వేలాది మంది భక్తుల తరలిరావడంతో దత్తాత్రేయుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దేశ విదేశాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి దత్తాత్రేయునికి రాఖీలు కట్టడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది శనివారం రాఖీ పండుగ కాగా పౌర్ణమి శుక్రవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభం కావడంతో శుక్రవారం నుంచే భక్తుల తాకిడి పెరిగింది.

మరాఠీలదే ముఖ్య పాత్ర

మహారాష్ట్ర భక్తులు తమ ఇలవేల్పుగా భావించే శ్రీపాద శ్రీవల్లభ స్వామి దర్శనానికి క్యూ కడతారు. ఒక్క మహారాష్ట్ర నుంచి ఏటా లక్షల మంది భక్తులు పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానానికి తరలివస్తారు.

రక్షాబంధన్‌కు రెడీ

కొత్తపల్లి: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలకు సర్వం సిద్ధమైంది. శనివారం రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని పలు దుకాణాల వద్ద రాఖీలు కొనుగోలు చేసేందుకు అక్కాచెల్లెలు క్యూకట్టారు. కొత్తపల్లి మండలంలో రాఖీ దుకాణాల వద్ద శుక్రవారం సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు రాఖీ అమ్మకాలు జోరుగా సాగాయి. పలు రకాల రాఖీలు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క రాఖీ రూ.5 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు.


శ్రీపాదుడికి రాఖీలు కడుతున్న మరాఠీ భక్తులు


కొత్తపల్లిలో రాఖీలను కొనుగోలు చేస్తున్న దృశ్యం



శ్రీపాదశ్రీవల్లభస్వామి పూజల్లో పాల్గొన్న మరాఠీ భక్తులు

అమ్మవారికి సారె పంపుతాం


కన్యకాపరమేశ్వరి అమ్మవారికి రాఖీ పౌర్ణమి సారె సమర్పిస్తున్న ఆలయ ఈఓ సౌజన్య

రాఖీ పౌర్ణమి రోజున కన్యాకాపరమేశ్వరి అమ్మవారు శ్రీపాదుడికి రాఖీ కట్టి ఆశీర్వచనాలు అందజేసిన సందర్భంగా శ్రీపాదుడి తరపున శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం నుంచి ఏటా అమ్మవారికి సారె బహుమతిగా పంపుతాం. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల భక్తుల కంటే 90 శాతం మంది మరాఠీ భక్తులే ఈ ఆలయానికి వస్తుంటారు. అన్ని సేవల్లోనూ స్వయంగా పాల్గొంటారు. దత్తాత్రేయుని అవతారాల్లో ప్రథమ అవతారమైన శ్రీపాదుడు 1320లో ఇక్కడ జన్మించినట్లు గురు చరిత్ర చెబుతోంది. మరాఠీలకు ఇలవేల్పు దైవం కావడంతో దత్తాత్రేయ భక్తులు రాఖీ పౌర్ణమి నాడు ఇక్కడకు వస్తారు. **ఆర్.సౌజన్య**, ఈఓ, శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం, పిఠాపురం

ఏటా భక్తుల సంఖ్య పెరుగుతోంది



ఏటా రాఖీ పౌర్ణమికి ఇక్కడకు వచ్చే మరాఠీ భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కన్యాకాపరమేశ్వరీ అమ్మవారికి సోదరుడైన శ్రీపాదుడికి అమ్మవారు స్వయంగా వచ్చి పౌర్ణమి నాడు రాఖీ కట్టినట్లు చరిత్ర చెబుతోంది. అందుకే ఈ రాఖీ పౌర్ణమి రోజున అమ్మవారి తరపున స్వామి వారికి ఆలయ అర్చకులు, ముత్తయిదువులు రాఖీలు తెచ్చి సమర్పిస్తారు. స్వామికి అమ్మవారు పంపిన రాఖీ ముందుగా కట్టిన తరువాత భక్తులు స్వామి వారికి రాఖీలు కట్టడం ప్రారంభిస్తారు. కన్యకాపరమేశ్వరిని తమ ఆడపడుచుగా, శ్రీపాదుడిని తమ సోదరుడిగా భావించే మరాఠీలు ఇక్కడకు వచ్చి స్వామి వారికి రాఖీలు కడతారు. **ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ**, ఆలయ అర్చకులు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థనం, పిఠాపురం

వనదుర్గమ్మకు చండీహోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం పూర్ణాహుతి దృశ్యం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు. కాగా సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నిర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు.

ఘనంగా గాంధారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ


గాంధారమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు

ఏలేశ్వరం: పట్టణంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే గాంధారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఏలేరు ప్రాజెక్టు సమీపంలో దాతల సహకారంతో అమ్మవారి ఆలయం నిర్మించారు. పట్టణానికి చెందిన కోరాడ వీర్రాజు ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అలమండ దుర్గావెంకటప్రసాద్, సూర్యనారాయణమ్మ దంపతుల చేతుల మీదుగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రంగులు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు అమ్మవారికి చండీసప్తసతి హోమం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి దుర్గమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.